## క్లుప్తంగా

### 'లెక్క' తప్పొద్దు

నూరుశాతం పన్నులు వసూలు చేయాలి: ఎంపీడీఓ విజయలక్ష్మి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

**యాచారం:** పంచాయతీలో జమ, ఆదాయ వివరాలు తెలిపే రికార్డుల నమోదులో ఏ మాత్రం నిర్లక్ష్యం చేయరాదని ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. మండల పరిధిలోని చింతపట్ల గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శనివారం ఆమె సందర్శించారు. నాలుగేళ్లుగా పంచాయతీకి మంజూరవుతున్న నిధులు, ఖర్చుల వివరాలపై ఆరా తీశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వెంచర్ల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల గురించి తెలుసుకున్నారు. పన్ను వసూళ్లు వంద శాతం చేయాలని, గ్రామంలో ప్రాధాన్యత సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఆమె సూచించారు.

### పార్టీ బలోపేతానికి కృషి



**తలకొండపల్లి:** కల్వకుర్తి నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని బీజేవైఎం కాలేజ్ ఔట్‌రీచ్ రాష్ట్ర కన్వీనర్ నీలకంఠం పాండు అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన పాండు.. బీజేవైఎం కాలేజ్ ఔట్‌రీచ్ రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు బీజేవైఎం రాష్ట్రశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని పాండు శనివారం తెలిపారు. ఈ పదవితో నాపై మరింత బాధ్యత పెరిగిందని చెప్పారు. పార్టీ బలోపేతానికి శక్తిమేర పోరాడతానని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాశ్, పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, బీజేవైఎం కార్యాలయం కార్యదర్శి రాజశేఖర్‌కు పాండు కృతజ్ఞతలు తెలిపారు.

### సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు

**కడ్తాల్:** మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో సబ్సిడీపై విక్రయించేందుకు పశుగ్రాస విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మండల పశువైద్యాధికారి భానునాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు ఆధార్ కార్డుతో పశువైద్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

# అసత్యప్రచారాలు మాని.. అక్రమాలు నిరూపించాలి

డైరెక్టర్ జైపాల్‌రెడ్డికి చైర్మన్, డైరెక్టర్ల సవాల్

- కొత్తపల్లిది అవగాహనా రాహిత్యమే: డైరెక్టర్లు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డి, డైరెక్టర్లు

**అబ్దుల్లాపూర్‌మెట్:** సహకార సంఘంలో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ అసత్య ప్రచారాలు చేయడం మాని, అక్రమాలను నిరూపించాలంటూ బాటసింగారం సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి.. డైరెక్టర్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డికి సవాల్ విసిరారు. జైపాల్‌రెడ్డి ఆరోపణలను ఖండిస్తూ శనివారం సంఘం కార్యాలయంలో వైస్ చైర్‌పర్సన్ నార్లకొండ మల్లమ్మ, డైరెక్టర్లు ఇటుకల మహేందర్ రెడ్డి, గుండె సత్యనారాయణ, చింతల లక్ష్మమ్మ, కందాడి మహిపాల్‌రెడ్డి, మేకల రాములు, మొగుళ్ల యాదిరెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో విఠల్‌రెడ్డి మాట్లాడారు.

**సభ్యులను తప్పుదోవ పట్టించేందుకు..**

సెప్టెంబర్ 30న నిర్వహించిన సర్వసభ్య సమావేశాన్ని కోరం లేకపోవడం వల్లే రద్దు చేసినట్లు.. 20రోజుల క్రితం జరిగిన ఎంసీ మీటింగ్‌లో ప్రకటించి, డిసెంబర్ 30న మరోసారి సమావేశం నిర్వహిద్దామని పాలకవర్గం తీర్మానించిందని తెలిపారు. ఆ సమయంలో డైరెక్టర్ జైపాల్‌రెడ్డి అంగీకరించారని, కానీ.. శుక్రవారం జరిగిన సమావేశంలో గందరగోళం సృష్టించి రైతులు, సభ్యులను తప్పుతోవ పట్టించేందుకు యత్నించడం ఆయన అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. సంఘంతో సంబంధం లేని వ్యక్తులను తీసుకువచ్చి, సమావేశంలో ఆయన వ్యవహరించిన తీరు సిగ్గుచేటని మండిపడ్డారు. అనుచరులతో సంఘం ప్రతిష్టతను దెబ్బతీసే విధంగా జైపాల్‌రెడ్డి ప్రవర్తించడం బాధకరమన్నారు. పాలకవర్గ సభ్యుడై ఉండి.. అందరికీ ఆదర్శంగా నిలవాల్సింది పోయి.. ఆగం చేస్తున్నాడంటూ విమర్శించారు. సంఘం పరిధిలో ప్రతి జమాఖర్చుల వివరాలను క్షుణంగా పరిశీలిస్తామని, క్రమం తప్పకుండా ఆడిట్ జరుగుతుందని తెలిపారు. సభ్యులందరికీ అందుబాటులో ఆ నివేదికను ప్రవేశ పెడుతున్నామని పేర్కొన్న ఆయన.. సంఘం పరిధిలో రూ. కోట్లల్లో అవినీతి జరిగిందంటూ ఆరోపించడం హాస్యాస్పదమన్నారు. రాజకీయంగా ఎదుర్కొనే శక్తిలేకే.. ఇలాంటి చిల్లర పనులు చేస్తున్నారని జైపాల్‌రెడ్డిని ఉద్దేశించి విఠల్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు.

# 'భైరి'పై పీడీయాక్ట్ నమోదు చేయాలి



ఠాణాలో ఫిర్యాదు చేస్తున్న ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి నాయకులు

**కడ్తాల్:** హిందూ దేవుళ్లపై అనుచిత వాఖ్యలు చేసిన భైరి నరేశ్‌పై పీడీయాక్ట్ నమోదు చేసి, కఠినంగా శిక్షించాలంటూ హిందూ బంధువుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై నరేశ్ దిష్టిబొమ్మను దహనం చేసి, నిరసన తెలిపారు.

**ఎస్సీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో**

భారత నాస్తిక సమాజం పేరిట అయ్యప్ప స్వామిపై అనుచిత వాఖ్యలు చేసిన నరేశ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి ఉప్పుల నర్సింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్సీఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు మహేశ్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్, నాయకులు వినోద్, పవన్, శేఖర్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సాయిలు, కుమార్, మల్లేశ్, భగీరథ్, రాఘవేంద్ర, ప్రవీణ్ ఉన్నారు.

# ఘనంగా ఇరుముడి మహోత్సవం



శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప మాలధారులు

**ఆమనగల్లు:** పట్టణంలోని అయ్యప్పకొండపై వెలసిన శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో శనివారం ఇరుముడి మహోత్సవం కనుల పండువగా సాగింది. అయ్యప్ప మహాపడిపూజను వైభవంగా నిర్వహించారు. అనంతరం 41 రోజుల పాటు నియమనిష్టలతో మండల దీక్షను పూర్తిచేసుకున్న అయ్యప్ప మాలధారులు.. ఇరుముడులు కట్టుకొని శబరిమలకు బయలుదేరారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, అయ్యప్ప మాలధారులు శ్రీశైలం, టిల్లుయాదవ్, మల్లేశ్, ప్రవీణ్, సిద్దార్థ, నిఖిల్, నరేశ్, అమ్రు శబరిమలకు వెళ్లారు.

# ప్లాస్టిక్ రహిత పట్టణంగా మారుస్తా..

- రూ.9 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతా
- ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ ఎండీ యూసుఫ్



**ఇబ్రహీంపట్నం:** కొత్త సంవత్సరంలో సుమారు రూ.9 కోట్లతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు, ఇతర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కమిషనర్ ఎండీ యూసుఫ్ తెలిపారు. 2023లో అడుగుపెడుతున్న సందర్భంగా 'సాక్షి'తో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి చొరవతో మంజూరైన రూ. 5 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో పాటు, 3.85 కోట్ల ఎల్ఆర్ఎస్, 14 ఫైనాన్స్, పట్టణ ప్రగతి నిధులతో మున్సిపాలిటీలోని 24 వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీ, వైకుంఠధామాల వద్ద మౌలిక సదుపాయాలకు వెచ్చించనున్నట్లు తెలిపారు. ప్రతి ఏరియాలో వీధిలైట్లు వెలిగేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. 5వ వార్డు, కేవీ తండా, శేరిగూడలో బస్తీ దవాఖానలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. నర్సరీ ఏర్పాటు చేసి హరితహారానికి కావాల్సిన మొక్కలను పెంచుతామన్నారు. జనవరి లోపు ఇంటింటికీ మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఇచ్చి.. తాగు నీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. పాత పోలీస్‌స్టేషన్ వద్ద 32 కూరగాయల షెడ్లను, పాత పోలీస్ క్వార్టర్స్ వద్ద నాన్‌వెజ్ షాపులను, పాత బస్టాండ్ వద్ద నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి, పై అంతస్తులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నూతన భవనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ వెల్లడించారు. ప్రతి అంగన్‌వాడి కేంద్రానికి విద్యుత్ సౌకర్యంతో పాటు బాత్రూం నిర్మించి ఇస్తామన్నారు. డాగ్‌బంగ్లా చౌరస్తాలో కొత్తగా అంబేడ్కర్ భవనం నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా ఇబ్రహీంపట్నంను తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. అందరి సహకారంతో అభివృద్ధి పథంలో మున్సిపాలిటీని నడిపించేందుకు అన్నిరకాల చర్యలను కొత్త సంవత్సరంలో తీసుకోనున్నట్లు యూసుఫ్ వెల్లడించారు.

### బీజేపీ నూతన కార్యవర్గం

**తలకొండపల్లి:** మండల పరిధిలోని జూలపల్లిలో 31, 32వ భూత్ కమిటీల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శనివారం బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, శక్తి కేంద్రం ఇన్‌చార్జి పేరుమళ్ల రాజు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా కమిటీ అధ్యక్షులను ఎంపిక చేశారు. 31వ భూత్ అధ్యక్షుడిగా యాదయ్య, 32వ భూత్ అధ్యక్షుడిగా కృష్ణను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి హరికాంత్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తోనే దేశం అభివృద్ధి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మంచిరెడ్డి

**మంచాల:** దేశంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం మంచాల మండల పరిధిలోని లోయపల్లి గ్రామానికి చెందిన పలువురు.. ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. కష్టపడి పని చేసేవారికి పార్టీలో భవిష్యత్ ఉంటుందన్నారు. పార్టీలో చేరిన వారిలో శ్రీశైలం, మల్లేశ్, యాదయ్య, రాజు, శ్రీను ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చీరాల రమేష్, ప్రధాన కార్యదర్శి బహుదూర్, ఎంపీపీ నర్మద, పీఏసీయస్ చైర్మన్ పుల్లారెడ్డి, యువజన విభాగం మండల అధ్యక్షుడు గుప్తా, నాయకులు నారి యాదయ్య, ప్రవీణ్, జానయ్య, వెంకటేశ్ జంగయ్య తదితరులు పాల్గొన్నారు.





# ప్రణాళికాబద్ధంగా మున్సిపాలిటీ అభివృద్ధి



మురుగు కాలువ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఆచారి, రాంపాల్‌నాయక్

**ఆమనగల్లు:** ఆమనగల్లు మున్సిపాలిటీని ప్రణాళికాబద్ధంగా అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్నట్లు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని 11వ వార్డులో రూ.20 లక్షలతో చేపట్టే అంతర్గత మురుగు కాలువ నిర్మాణ పనులు, నుచ్చుగుట్టతండాలో రూ.25 లక్షలతో సీసీరోడ్డు, రూ. 15 లక్షలతో అంతర్గత మురుగు కాలువ నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. మున్సిపాలిటీపై అధికార పార్టీ వివక్ష చూపుతుందని, మున్సిపాలిటీ పాలకవర్గంపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఎవరూ ఏ విధంగా విమర్శలు చేసినా.. ఇప్పటివరకు మున్సిపాలిటీలో దాదాపు రూ. 6 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్‌లు బైకని యాదమ్మ, దివ్య, చెన్నకేశవులు, లక్ష్మణ్, బీజేపీ నాయకులు గోరటి నర్సింహ, శ్రీకాంత్‌సింగ్, బైకని శ్రీశైలంయాదవ్, జనిగల గిరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### మార్కెట్‌కు స్థలం కేటాయించండి



సర్పంచ్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారులు

**కడ్తాల్:** మండల కేంద్రంలో కూరగాయల క్రయవిక్రయాలకు ప్రత్యేక స్థలం లేక, అనేక ఇబ్బందులు పడుతున్నామని, ప్రత్యేక స్థలం కేటాయించాలని వ్యాపారులు కోరారు. ఈ మేరకు శనివారం సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డికి వ్యాపారులు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రస్తుతం జాతీయ రహదారిపై పక్కన ప్రభుత్వ పాఠశాల ప్రహరీ ఎదుట మార్కెట్‌ను నిర్వహిస్తున్నామని, రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండి, ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని చెప్పారు. కావున క్రయవిక్రయాలకు ప్రభుత్వ స్థలం కేటాయించి, షెడ్లు నిర్మించి ఇవ్వాలని వారు కోరారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేవిధంగా కృషి చేస్తానని తెలిపారు. మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ, వార్డు సభ్యులు భిక్షపతి, మల్లయ్య, రాంచంద్రయ్య, వ్యాపారులు శేఖర్, జంగమ్మ పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**అబ్దుల్లాపూర్‌మెట్:** ముఖ్యమంత్రి సహాయనిధి కింద అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల గ్రామానికి చెందిన దంటపల్లి వీరారెడ్డికి రూ.60వేలు, వల్లపు ఐలయ్యకు రూ.60వేలు, డొంకెని బుచ్చయ్యకు రూ.18 వేలు మంజూరు కాగా.. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి వారికి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో బండరావిరాల ఎంపీటీసీ దంతూరి అనిత, జిల్లా రైతుబంధు కన్వీనర్ వంగేటి లక్ష్మారెడ్డి, బాటసింగారం సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు చక్రవర్తిగౌడ్, నాయకులు మొలుగు దానేష్, గుండ్ల జంగయ్య, కవాడి దయాకర్ రెడ్డి, కందికంటి ప్రవీణ్, చిలకమారి నర్సింహ పాల్గొన్నారు.

### వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యుడిగా జంగయ్య



**ఇబ్రహీంపట్నం రూరల్:** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడిగా ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్ గ్రామానికి చెందిన సీహెచ్ జంగయ్య ఎంపికయ్యారు. రెండు రోజుల క్రితం ఖమ్మం జిల్లాలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర కమిటీకి ఎన్నుకున్నట్లు జంగయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా సీపీఎం, అనుబంధ సంఘాల్లో క్రియాశీలకంగా పని చేస్తున్నట్లు తెలిపారు. మండల, జిల్లా స్థాయి నుంచి నేడు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం వెనక కార్యకర్తల కృషి ఉందన్నారు. వ్యవసాయ కార్మిక హక్కుల సాధన కోసం పాటుపడతానన్నారు.

# అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

- నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం
- యూత్ కాంగ్రెస్ నాయకులు



కడ్తాల్: పోలీసుల అదుపులో కాంగ్రెస్ నాయకులు



ఆమనగల్లులో..

**కడ్తాల్:** సమస్యలపై పోరాడుతున్న వారిని అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమని, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్ అన్నారు. పోలీస్ నియామకాల్లో సడలింపులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు శనివారం ప్రగతిభవన్ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో.. పోలీసులు ముందస్తు చర్యగా.. ఉదయం 5 గంటలకు రవికాంత్‌ను ఎక్వాయిపల్లిలోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని ఆరోపించారు. పోలీసు ఉద్యోగాలకు పోటీ పడుతున్న అభ్యర్థులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇస్తూ.. అరెస్టులకు భయపడేది లేదని చెప్పారు. పోలీసులు అదుపులోకి తీసుకున్నవారిలో.. రవికాంత్‌గౌడ్‌తో పాటు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్, నాయకులు రాజునాయక్, కుమార్, శ్రీను, రమేశ్, శ్రీకాంత్, మహేశ్, రాజు ఉన్నారు.

**ముందస్తు అరెస్టు..**

**ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో చలో ప్రగతిభవన్ పిలుపు మేరకు.. కార్యక్రమానికి వెళ్లకుండా.. కాంగ్రెస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని సాయంత్రానికి విడిచిపెట్టారు. అదుపులోకి తీసుకున్నవారిలో నాయకులు కృష్ణనాయక్, రాఘవేందర్, అలీం, రాజు తదితరులు ఉన్నారు.

**తలకొండపల్లిలో**

**తలకొండపల్లి:** పోలీసు నియామకాల్లో పలు అవకతవకలు జరిగాయని, కానిస్టేబుల్ పరీక్షల్లో తప్పులకు మార్కులు కలపాలంటూ యుజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి.. ప్రగతిభవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ మేరకు తలకొండపల్లి మండల కేంద్రం నుంచి కార్యక్రమానికి వెళ్తున్నారన్న సమాచారంతో పోలీసులు నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. అనంతరం సొంత పూచికత్తుపై విడిచిపెట్టారు. అదుపులోకి తీసుకున్న వారిలో.. సోషల్ మీడియా అసెంబ్లీ కన్వీనర్ అజీం, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ కన్వీనర్ రవీందర్‌యాదవ్, టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి ఉన్నారు.